సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



యూటర్న్ ఏర్పాటు చేయండి

తమ గ్రామానికి యూటర్న్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బ్రాహ్మణపల్లి గ్రామస్తులు రాస్తారోకో చేశారు.

- 9లో ▸



హామీలిచ్చి..

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు.

- 9లో ▸



గరిష్టం/కనిష్టం
34.6 /22.1

వాతావరణం

ఉదయం ఆహ్లాదకర గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'కేసుల పరిశోధనను వేగవంతం చేయాలి'



కామారెడ్డి క్రైం: కేసుల పరిశోధనను వేగవంతం చేయాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లు, సర్కిల్, సబ్ డివిజన్ అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతికతను ఉపయోగించుకొని పెండింగ్ కేసుల పరిశోధనను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆస్తి సంబంధిత నేరాలు, రోడ్డు ప్రమాదాలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు ప్రకాశ్, జగన్నాథ్‌రెడ్డి, శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో మహిళా కాంగ్రెస్ నేత



కామారెడ్డి టౌన్: ఢిల్లీలో నిర్వహిస్తున్న మహిళా కాంగ్రెస్ నేతల శిక్షణ తరగతులలో గురువారం కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికలపై అవగాహన కల్పించారని ఆమె 'సాక్షి'తో తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గురువారం మిడిల్, లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్ రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించామని తెలిపారు. వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని, ఈనెల 20న గోల్కొండలోని ఆర్టిలరీ సెంటర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరగౌడ్, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, సరిత, రేణుక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైది వీరే..

బి.గోపీచంద్, ఎం.గణేశ్, ఎల్.అఖిల, టి.కేదార్‌సింగ్, ఎం.ఈశ్వర్, బి.హరిత, కె.అనిల్, బి.అర్చన, ఎల్.ప్రసాద్, బి.జ్ఞానేశ్వర్.

వృత్తి నైపుణ్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: వృత్తి నైపుణ్య కోర్సులలో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సెట్విన్ కోఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాలపరిమితిగల ఎంఎస్ ఆఫీస్, టైలరింగ్, గార్మెంట్ మేకింగ్, బ్యూటీషియన్, అడ్వాన్స్ బ్యూటీషియన్, డీటీపీ, అకౌంట్స్ ప్యాకేజీ కోర్సులలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి చదివినవారు అర్హులని, కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి సెట్విన్ సంస్థ ద్వారా పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఓవర్సీస్ విద్యానిధి పథకానికి..

కామారెడ్డి క్రైం: పేద ఎస్సీ విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించడం కోసం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ అధికారి రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాలలోని విశ్వవిద్యాలయాలలో చదవాలనుకునేవారు వచ్చేనెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత కంప్యూటర్ కోర్సులతో పాటు, డిగ్రీలో 60 శాతం మార్కులు పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ స్కాలర్‌షిప్ ఇస్తామని స్పష్టం చేశారు.

రాంగ్ రూట్‌లో మైనర్లు!

బాల్యం గాడితప్పుతోంది. పుట్టినరోజు వేడుకల పేరుతో వింత పోకడలు ఎక్కువైపోతున్నాయి. సరదా పేరిట దుబారాకు విలువిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పిల్లలపై తల్లిదండ్రుల నిఘా సరిగా లేకపోవడంతో పలువురు మైనర్లు మద్యంతోపాటు గంజాయికీ అలవాటుపడుతూ భావి జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు.

- బర్త్‌డే వేడుకలలో వింత పోకడలు
- ఇష్టారాజ్యంగా బైక్ డ్రైవింగ్
- మద్యంతోపాటు గంజాయికీ బానిసలవుతున్న బాలలు
- చేటు తెస్తున్న చెడు స్నేహాలు
- నిఘావేయని కుటుంబ సభ్యులు



సాక్షి, కామారెడ్డి: పిల్లలు పెరుగుతున్న కొద్దీ వారి మీద కన్నవారికి ఆశ లు పెరగడం సహజం. పిల్లలు శ్రద్ధగా చదివి ప్రయోజకులు కావాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. వాళ్ల చదువుల కోసం తమ స్థాయికి మించి ఖర్చు చేస్తుంటారు. ఏది అడిగినా కాదనకుండా సమకూరుస్తుంటారు. కొందరు తల్లిదండ్రులైతే అడిగినన్ని డబ్బులూ ఇస్తుంటారు. డబ్బు విలువ తెలి యని 'కొందరు' పిల్లలు.. దానిని దుబారా చేస్తూ రాంగ్ రూట్‌లోకి వెళ్తున్నారు. చెడు స్నేహాలు ఎక్కువైపోయి చేయకూడని పనులు చేస్తున్నారు.

ఇటీవలి కాలంలో బర్త్‌డే పేరిట వింత పోకడలు ఎక్కువైపోయాయి. చిన్నపిల్లల పుట్టిన రోజు వేడుకను తల్లిదండ్రులు దగ్గరుండి జరిపిస్తారు. కాస్త వయసు వచ్చిన పిల్లలు దోస్తుల మధ్య వేడుక జరుపుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఈ సరదాను తల్లిదండ్రులు కాదనలేక అడిగినన్ని డబ్బులు ఇస్తున్నారు. ఆ డబ్బులతో అర్ధరాత్రి వరకు దోస్తులతో మద్యం తాగి, రాత్రి 12 గంటలు దాటగానే నడిరోడ్డు మీదకు వచ్చి కేక్ కట్ చేసి హంగామా చేయడం సాధారణంగా మారింది. తాగిన మత్తులో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో కేక్‌ను ముఖానికి రుద్దడంతో పాటు బర్త్‌డే బంప్స్ పేరుతో ఇష్టమొచ్చినట్లుగా కొట్టడం వంటి చేష్టలకు పాల్పడుతున్నారు.

'బీరు'బాలురుగా..

స్నేహాలతోపాటే చెడు అలవాట్లు పెరుగుతున్నాయి. మైనర్లు చాలామంది మద్యానికి అలవాటు పడుతున్నారు. ఎక్కువగా బీర్లు తాగుతున్నారు. పల్లెలు, పట్టణాల్లో కొందరు రాజకీయ నాయకులు ఏదైనా కార్యక్రమం కోసం జన సమీకరణ చేసే సందర్భంలో వచ్చిన వారికి మద్యం తాగిస్తున్నారు. ఒకరిని చూసి ఒకరు అన్నట్టుగా చాలామంది పిల్లలు తాగుడుకు అలవాటుపడుతున్నారు. వైన్ షాపుల్లో మైనర్లకు మద్యం విక్రయించబోమనే బోర్డులు ఉంటున్నా.. అది అమలు కావడం లేదు. కొందరు విద్యార్థులు గంజాయికి కూడా అలవాటు పడుతూ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు మేల్కొని తమ పిల్లలపై నిఘా పెట్టి, వారు వక్రమార్గం పట్టకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది.



ద్విచక్ర వాహనాలపై మైనర్లు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌హెచ్‌వో నరేశ్

పిల్లల చేతికి బైకులు..

చాలామంది తమ పిల్లలకు బైక్ నేర్పిస్తుంటారు. మైనర్లకు బైక్ ఇవ్వడం తప్పని తెలిసినా.. తల్లిదండ్రులు ప్రోత్సహిస్తుంటారు. ఏదైనా పని ఉంటే ఆసరా అవుతారనే భావనతో ఎంకరేజ్ చేస్తున్నారు. పిల్లలేమో సరదాగా ఆ బైక్‌లపై రౌండ్లు వేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు దోస్తులను ఎక్కించుకుని బైకుల మీద దూసుకుపోతున్నారు. స్కూల్ వయసులోనే బైకులు, స్కూటీల మీద తిరుగుతున్నారు. కొందరు పిల్లలు కాలేజీలకు బైకులపైనే వెళ్తున్నారు. ప్రధాన రోడ్ల మీదకు వెళ్తే పోలీసులు పట్టుకుంటారన్న భయంతో గల్లీల్లో ఇష్టారీతిన బైక్‌లు నడుపుతున్నారు. ట్రాఫిక్‌పై అవగాహన లేని వయసులో బైక్‌లను నడుపుతూ ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడమో.. స్పీడ్‌బ్రేకర్ల వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోవడమో జరుగుతున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. జిల్లా కేంద్రంలో పోలీసుల తనిఖీలలో అప్పుడప్పుడు మైనర్లు బైక్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించి 54 కేసులు నమోదయ్యాయి. రూ. 27 వేలు జరిమానాలు విధించారు. మైనర్‌కు, అతడి తండ్రికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కేసులు నమోదవుతున్నా మైనర్ల డ్రైవింగ్‌కు అడ్డుకట్ట పడడం లేదు.

తల్లిదండ్రులు ఆలోచించాలి



పిల్లలు వాహనాలు నడుపుతున్నారని తల్లిదండ్రులు మురిసిపోవడం కాదు.. వారు చేస్తున్నది తప్పు అన్న విషయాన్ని గుర్తించాలి. పిల్లలు వాహనం నడిపేటపుడు ఎదురుగా వచ్చే వాహనాల వేగాన్ని, జనాన్ని సరిగా అంచనా వేయలేరు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. అలాగే తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై కన్నేయాలి. వారు అడిగినన్ని డబ్బులు ఇస్తే.. వాడు ఎటు పోతున్నాడో, ఏం చేస్తున్నాడో అర్థం కాదు. అందుకే డబ్బు విలువ చెప్పాలి. బర్త్‌డే పేరుతో జరుగుతున్న అతిని నిరోధించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ

సన్మార్గంలో నడపాలి



పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపేది కుటుంబమే. పిల్లల చేతికి మొబైల్ ఇచ్చే తల్లిదండ్రులే.. తమ పిల్లలు ఫోన్‌కు అడిక్ట్ అయ్యారని బాధపడుతుంటారు. మైనర్లు బైక్ నడిపి ప్రమాదానికి కారణమైతే తల్లిదండ్రులూ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పిల్లలు చెడిపోవడానికి మీడియా, సోషల్ మీడియా, టెక్నాలజీ కారణమని తిడుతూ తల్లిదండ్రులు బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారు. పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారిని సన్మార్గంలో పెట్టేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించాలి.

– తిరునగిరి శ్రీహరి, సైకాలజిస్ట్

వెల్లువలా దరఖాస్తులు

- 49 మద్యం దుకాణాలకు 1,388 దాఖలు
- నేటితో ముగియనున్న గడువు

సాక్షి, కామారెడ్డి: మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. గురువారం ఒక్కరోజే 445 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇప్పటివరకు 1,388 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 49 వైన్‌షాపులున్నాయి. 2021–23 సంవత్సరాలకుగాను నిర్వహించిన టెండర్లలో 981 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల దాఖలుకు శుక్రవారం చివరిరోజు కావడంతో భారీగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల ఫీజు వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,388 దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 27.76 కోట్ల ఆదాయం సమకూరింది.

సర్కిళ్లవారీగా..

కామారెడ్డి సర్కిల్ పరిధిలో 15 మద్యం దుకాణాలుండగా.. ఇప్పటివరకు 469 దరఖాస్తులు వచ్చాయి. దోమకొండ సర్కిల్ పరిధిలో 8 మద్యం దుకాణాలకు 273 దరఖాస్తులు, ఎల్లారెడ్డి సర్కిల్‌లో 7 మద్యం దుకాణాలకు 204 దరఖాస్తులు, బాన్సువాడ సర్కిల్‌లో 9 వైన్‌షాప్‌లకు 220 దరఖాస్తులు, బిచ్కుంద సర్కిల్‌లో 10 మద్యం దుకాణాలకు 222 దరఖాస్తులు దాఖలయ్యాయి. జిల్లావ్యాప్తంగా రెండుమూడు చోట్ల తప్ప మిగతా వైన్‌షాప్‌లకు తీవ్ర పోటీ నెలకొంది. ఎన్నికల ఏడాది కావడం వల్లే మద్యం దుకాణాలకు తీవ్ర పోటీ ఏర్పడుతోందని తెలుస్తోంది. దీనికి తోడు రియల్, కన్‌స్ట్రక్షన్ దందాల్లో స్తబ్దత నెలకొన్న పరిస్థితుల్లో చాలా మంది రియల్టర్లు ప్రత్యామ్నాయంగా మద్యం వ్యాపారం వైపు మళ్లుతున్నట్లు తెలుస్తోంది. అందుకే మద్యం దుకాణాలకు పోటీ పెరిగిందని భావిస్తున్నారు.

39నంబర్ షాప్‌కు అత్యధిక దరఖాస్తులు

జిల్లాలో అత్యధిక అప్లికేషన్లు బాన్సువాడ సర్కిల్ పరిధిలోని కేఎంఆర్ 39 నంబరు దుకాణానికి వచ్చాయి. ఇక్కడ ఇప్పటివరకు 64 దరఖాస్తులు నమోదయ్యాయి. దోమకొండ సర్కిల్ పరిధిలోని కేఎంఆర్ 23 నంబరు దుకాణానికి 63 దరఖాస్తులు వచ్చాయి.

48 నంబర్‌కు ఒక్కటే..

బిచ్కుంద ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోగల కేఎంఆర్ 48 నంబరు వైన్ షాపునకు ఒకే ఒక్క దరఖాస్తు వచ్చింది. అదే సర్కిల్ పరిధిలోని 49 వ నంబరు వైన్ షాప్‌కు ఆరు దరఖాస్తులు వచ్చాయి.

'ఎన్నికలకు సన్నద్ధం కావాలి'



మాట్లాడుతున్న అరుణతార

నిజాంసాగర్: ఎన్నికలకు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మేకల నరేశ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు సమయం సమీపించినందున కార్యకర్తలు మరింత క్రియాశీలకంగా మారాలన్నారు. గడప, గడపకు పార్టీని తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్తు ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండల మహిళా అధ్యక్షురాలు స్వరూప పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కాకుండా అవగాహన కల్పించడంతో పాటు వాటిని సమూలంగా అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన నార్కో సమన్వయ కమిటీ (ఎన్‌సీవోఆర్‌డీ) మూడో సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల రవాణాను అరికట్టడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మత్తుపదార్థాల విక్రయిస్తున్నా, అక్రమంగా గంజాయి సాగుచేస్తున్నా కేసులు నమోదు చేయాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయంపై సమాచారం తెలిస్తే వెంటనే కమిటీ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. పారిశ్రామిక ప్రాంతాలు, విద్యాలయాల పరిసర ప్రాంతాలలో మత్తుపదార్థాల విక్రయం జరిగే అవకాశాలుంటాయన్నారు. ఆ ప్రాంతాలలో ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. వీధి బాలలు, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అటు తల్లిదండ్రులతో పాటు, ఇటు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలలో మత్తుపదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపులలో డ్రగ్స్ అమ్మకుండా చూడాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌లకు సూచించారు. సమావేశంలో డీటీవో వాణి, డీఈవో రాజు, డీఏవో భాగ్యలక్ష్మి, డీపీవో పద్మజ, ఎఫ్ఆర్‌వో రమేష్, డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ చిత్రానికి చక్కని స్పందన



గాంధీ చిత్రాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

కామారెడ్డి క్రైం: గాంధీ చలన చిత్రాన్ని తిలకించడానికి విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో వస్తున్నారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలో తొమ్మిది థియేటర్లలో చిత్రాన్ని ప్రదర్శించారని, 26 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 5,072 మంది విద్యార్థులు తిలకించారని తెలిపారు.

'తుపాకీ రాముడిలా కేటీఆర్ మాట్లాడుతుండు'



కాంగ్రెస్‌లో చేరినవారితో షబ్బీర్ అలీ

భిక్కనూరు: ప్రజలకు మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకునే తుపాకీ రాముడిలాగా ఐటీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. ఆయన మాటలకు కాలం చెల్లిందన్నారు. గురువారం మల్లుపల్లికి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు బీఆర్ఎస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. మంత్రి కేటీఆర్ తన స్థాయిని తక్కువ చేసుకుని మాట్లాడుతున్నాడని, అది సంస్కారం అనిపించుకోదని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు ఈరెండు పార్టీల నేతలు ఒకరి మీద మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటివరకు 20 శాతం మందికి మాత్రమే పంట రుణం మాఫీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజిరెడ్డి, మైపాల్‌రెడ్డి, నర్సింలు, గంగయ్య, లింగారెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ, బాన్సువాడ మండలం, బీర్కూర్ మండలాలకు మంజూరైన అంబులెన్స్‌లను గురువారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. బాన్సువాడ మున్సిపాలిటీ, మండలానికి 108 అంబులెన్స్, బీర్కూర్‌కు 102 అంబులెన్సు మంజురయ్యాయి. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్, నాయకులు కృష్ణారెడ్డి, ఎజాస్, అంజిరెడ్డి, బుల్లెట్ రాజు, శ్రీధర్, లింగం, వనం గంగాధర్, వాహబ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు తిరుగులేని ఆయుధం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రకాంత్

కామారెడ్డి అర్బన్: ప్రజాస్వామ్య దేశంలో సరైన నాయకులను ఎన్నుకోవడంలో ఓటు తిరుగులేని ఆయుధమని, దాని ప్రాధాన్యతను యువత గుర్తించడంతో పాటు గ్రామాలకు వెళ్లినపుడు ప్రతి ఒక్కరిని చైతన్యం చేయాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రకాంత్ పేర్కొన్నారు. సిస్టమేటిక్ ఓటర్స్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్)పై గురువారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓటు దుర్వినియోగం మనల్ని మనం మోసం చేసుకోవడం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి, లెఫ్టినెంట్ రామస్వామి, అధ్యాపకులు కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుచరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈసారైనా చర్చ జరిగేనా?

- తూతూమంత్రంగా జెడ్పీ సమావేశాలు
- ప్రతిసారి ఆలస్యంగా వస్తున్న సభ్యులు
- మూడు నాలుగు అంశాలపైనే చర్చ
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కామారెడ్డి అర్బన్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన సమావేశం జరగనుంది. అయితే మూడు నెలలకోసారి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జెడ్పీ మీటింగ్ ప్రతి సారి గంటకుపైగా ఆలస్యంగా ప్రారంభమవుతోంది. ఎజెండాలో ఎన్నో అంశాలు ఉంటున్నప్పటికీ.. మూడునాలుగు అంశాలపై చర్చతోనే సరిపెడుతున్నారు. దీంతో చాలా సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. చిన్న జిల్లాలో సమస్యలపై విస్తృతంగా చర్చించడానికి అవకాశం ఉంటుందని భావించామని.. కానీ మూడు నాలుగు అంశాలతోనే సరిపెడుతుండడంతో లక్ష్యం నెరవేరడం లేదని జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వికలాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీలో వివిధ కారణాలతో రెండుసార్లు లోపం జరిగినప్పుడు మూడోసారి జిల్లా ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ ఇవ్వడం సాధ్యం కాదని వైద్యులు చెబుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఐదేళ్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో చాలామందికి దివ్యాంగుల పెన్షన్‌తోపాటు ఇతర సంక్షేమ పథకాలు అందడం లేదు. అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ ఇప్పించలేకపోతున్నామని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డితో పాటు పలువురు సభ్యులు అనేకసార్లు సభలో పేర్కొన్నారు. అలాగే వితంతువులకు పెన్షన్లు, రేషన్‌కార్డులు, డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపు, మిషన్ భగీరథ నీళ్లు, ప్రాణహిత చేవెళ్ల 22 వ ప్యాకేజీ పనులు, అటవీ ప్రాంతాల నుంచి ఉన్న రోడ్ల విస్తరణకు భూమి కేటాయింపు అడ్డంకులు, అభివృద్ధి పనుల్లో జాప్యంలాంటి సమస్యలపై విస్తృత చర్చ జరగకపోవడంతో ఆయా సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. దీంతో జెడ్పీ మీటింగ్‌పై పలువురు ప్రజాప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ఈ సమావేశంలో అయినా అన్ని అంశాలపై విస్తృత చర్చ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

రామారెడ్డి/బాన్సువాడ రూరల్ (ఎల్లారెడ్డి): రామారెడ్డి గురుకుల బాలుర కళాశాల(ఉప్పల్ వాయి)లో ఖాళీగా ఉన్న సీట్లకు, బాన్సువాడ గురుకుల బాలికల విద్యాలయం(బోర్లం)లో నేడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్స్‌పాల్స్ సత్యనారాయణ, పద్మకుమారీలు వేర్వేరుగా తెలిపారు. ఉప్పల్ వాయిలోని గురుకులంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోని బైపీసీ గ్రూప్ ఎస్సీ కోటాలో ఖాళీగా ఉన్న సీట్లకు, బోర్లంలోని గురుకులంలో ఎంపీసీలో మిగిలిన సీట్ల భర్తీకి శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

కామారెడ్డి రూరల్ :దేవునిపల్లిలో గల లింగంపేట గురుకుల కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరంలో మిగిలి వున్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పుష్పలత తెలిపారు.

19న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమావేశం

కామారెడ్డి అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(2023–24) జిల్లా సమావేశం ఈనెల 19న శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక కామారెడ్డి వశిష్ఠ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

19లోపు దరఖాస్తు చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ(హైద్రాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించే ఐఐటీ–2024 లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 19 వరకు గడువు పెంచినట్లు కొయ్యగుట్టలోని గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై, ఐఐటీలో సాధారణ ప్రతిభ కనబర్చిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ, ఐఐటీ ర్యాంకు కార్డు తదితర ధ్రువీకరణ పత్రాలతో ధర్మారం (బి)లోని ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



మద్నూర్(జుక్కల్): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిందన్నారు. అన్ని సర్వేలు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని చెప్పడంతో సీఎం భయంతో ఓటర్లకు తాయిలాలు అందించి కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని విమర్శించారు. ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

విద్యార్థినుల చదువుకు సోపానం

- తగ్గిన దూరభారం
- బీబీపేటకు నూతనంగా మంజూరైన జూనియర్ కళాశాల
- కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ



బీబీపేట జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థినులు



కళాశాల కోసం కేటాయించిన టీఎస్ఎస్ఆర్ ఉన్నత పాఠశాల భవనం

బీబీపేట: మండల కేంద్రంలో ఎన్నో ధర్నాలు, ఉద్యమాల తర్వాత బీబీపేట మండల కేంద్రానికి జూనియర్ కళాశాల ఎట్టకేలకు మంజూరైంది. ప్రస్తుతం స్థానిక టీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని నాలుగు గదుల్లో తరగతులను నిర్వహించడానికి సిద్ధం చేశారు. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండడంతో పాటు తరగతులను నిర్వహించేందుకు లెక్చరర్లను వివిధ జూనియర్ కళాశాలల నుంచి ఇక్కడికి తీసుకొస్తున్నారు. ఒక్కొక్కరు ఒక్క రోజు తరగతులు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. బీబీపేట మండలంలో మొత్తం 11 గ్రామాలు కాగా.. విద్యార్థుల సంఖ్య సైతం ఎక్కువగానే ఉంటుంది. కానీ కళాశాల ఏర్పడడం కొంత ఆలస్యం కావడంతో చాలా మంది విద్యార్థులు కామారెడ్డి, దోమకొండ, రామాయంపేట, దుబ్బాకలో అడ్మిషన్లు పొందారు. మరికొంత మంది ఆడపిల్లలను చదువుకు దూరభారం ఏర్పడడంతో తల్లిదండ్రులు పైచదువులకు పంపించకుండా బంద్ చేయించారు. ప్రస్తుతం ఆడపిల్లలకు దూరాభారం తగ్గడంతో పాటు వారు చదువుకోవడానికి అనువైన స్థలం దొరకడంతో ఎక్కువగా ఆడపిల్లల అడ్మిషన్లు వస్తున్నాయని లెక్చరర్లు చెబుతున్నారు. 2021 నవంబర్ 9వ తేదీన కళాశాలను తీసుకువస్తామని మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలు ప్రకటించారు. సరిగ్గా రెండు సంవత్సరాల్లోనే కళాశాలను ప్రారంభిస్తూ జీవో విడుదల చేశారు.

30 కి.మీల వరకే బస్ పాస్ సౌకర్యం

బీబీపేట మండలానికి చెందిన విద్యార్థులు గతంలో జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే దోమకొండ, కామారెడ్డికి వెళ్లాల్సిందే. బీబీపేట నుంచి దోమకొండ 15 కి.మీ, కామారెడ్డి 30 కి.మీ. వరకు ఉంటుంది. సమయానికి ఆర్టీసీ బస్సులు సైతం లేకపోవడం, విద్యార్థులు ఎక్కువగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడేవారు. ఆర్టీసీ బస్‌పాస్ 30 కి.మీ. వరకు మాత్రమే అవకాశం ఉండడం, దీంతో కామారెడ్డికి ఆర్టీసీ బస్సు ద్వారా వెళ్లాలంటే బీబీపేట వరకే బస్సు సదుపాయం ఉండేది. తుజాల్‌పూర్, మల్కాపూర్, శేరిబీబీపేట విద్యార్థులకు కామారెడ్డి వరకు బస్‌పాస్ సదుపాయం లేకపోవడం వల్ల ఆర్థికంగా భారం పడుతుండేది. కానీ ప్రస్తుతం బీబీపేటలోనే కళాశాల ప్రారంభం కావడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడ్మిషన్లు కొనసాగుతున్నాయ్



నూతనంగా ఏర్పాటైన జూనియర్ కళాశాల స్థానిక టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతుంది. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులున్నాయి. అలాగే అడ్మిషన్లు సైతం కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 47 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. లెక్చరర్లను సైతం ఇతర కళాశాలల నుంచి తీసుకొని తరగతులు రేపటి నుంచి ప్రారంభిస్తాము. విద్యార్థులు తరగతులకు హాజరుకావాలి.

– జైపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, బీబీపేట

అటవీ అధికారులపై దాడి

- విధులకు ఆటంకం.. పలువురిపై ఫిర్యాదు



దున్నిన అటవీ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

మాచారెడ్డి : మండలంలోని అక్కాపూర్ ఎల్లంపేట గ్రామాల మధ్య అటవీ భూమిని దున్నుతున్నారన్న సమాచారం మేరకు వెళ్లిన అటవీశాఖ అధికారులపై ఎల్లంపేట గ్రామస్తులు దాడి చేసి విధులకు ఆటంకపర్చారు. అటవీశాఖ రేంజ్ అధికారి పవన్‌కుమార్ బీట్ అధికారి తిరుపతి కథనం ప్రకారం బుధవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో వచ్చిన సమాచారం మేరకు అటవీ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. అధికారుల రాకను గమనించిన ఎల్లంపేట గ్రామస్తులు నాలుగు ట్రాక్టర్లను తీసుకుని ఎల్లంపేటలోని వడ్డెర గూడెం వైపు పారిపోయారు. ఆ ట్రాక్టర్లను వెంబడిస్తూ పోలీసుల సాయంతో అక్కడికి అధికారులు చేరుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసే ప్రయత్నం చేస్తున్న అధికారులపై గ్రామస్తులు దాడికి పాల్పడడంతో పాటు విధులకు ఆటంకపర్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఎల్లంపేట పరిధిలోని ఒడ్డె గూడెంకు చెందిన కుంచపు మైసయ్య, పల్లపు జగన్, పెనుగొండ రమేశ్, కుంచపు లింగం తో పాటు వీరికి సహకరించిన అక్కాపూర్ గ్రామానికి చెందిన బట్ట రాజనర్సు గడ్డం మహేష్ లపై ఫిర్యాదు చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



కామారెడ్డిలో నిరసన తెలుపుతున్న సీఆర్‌పీలు

కామారెడ్డి రూరల్/లింగంపేట: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, జేఏసీ లింగంపేట కన్వీనర్ మాధవి మాట్లాడుతూ.. బుధవారం చలో ఎస్‌పీడీ కార్యాలయం ముట్టడికి హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఉద్యోగులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం అన్యాయమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఎస్‌పీడీ కార్యాలయానికి వెళితే తమ గోడు వినిపించుకోకుండా పోలీస్ స్టేషన్లకు తరలించడం అప్రజాస్వామికమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించి ఉద్యోగుల క్రమబద్ధీకరణ వెంటనే చేపట్టాలని కోరారు.

నేతాజీ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం: విపత్తు నిర్వహణలో విశేష కృషి సల్పిన వ్యక్తులు, సంస్థల నుంచి సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్ అవార్డులకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తెలిపారు. జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా విపత్తు నిర్వహణలో అద్భుతమైన పనితీరు కనబరచిన వ్యక్తులకు, సంస్థలకు భారత ప్రభుత్వం ప్రతి ఏటా అవార్డును అందిస్తున్నదన్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తులకు, సంస్థలకు మూడు రకాల నగదు బహుమతులు అందజేస్తుందన్నారు. 2024 సంవత్సరానికి గాను అవార్డుకు అర్హులని భావించిన వ్యక్తులు లేదా సంస్థలు సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గురుకుల పాఠశాలలో బోధించడానికి..

దోమకొండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేయటాని కి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆ హ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శివరాము లు తెలిపారు. జూనియర్ లెక్చరర్‌లుగా బాట నీ, ఫిజిక్స్ విభాగాల్లో అదేవిధంగా పీజీటీలో సోషల్,ఇంగ్లీష్‌లో బోధించటానికి పీజీతో పా టు బీఎడ్ చేసిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.డెమో ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని,మరిన్ని వివరాలకు 70326 41925 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సమస్యలపై రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బాన్సువాడ: బీర్కూర్ రైతు వేదికలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం(రుద్రూర్) ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వనరులు, నేలల రకాలు, పంట పొలాలు, పశువులు, వివిధ సమస్యలపై చార్టులు, నేలపై బొమ్మల రూపంలో ప్రదర్శించారు. ఈ నెల 16 నుంచి 22 వరకు వయ్యారిభామ అవగాహన వారోత్సవాలు జరుగుతున్నాయని, ఈ వారోత్సవాల్లో కలుపు మొక్కను పూత దశకు ముందే నిర్మూలించిడం, చెరువుల్లో నీటి నిలువ, పంట పొలాల్లో నీటి నిలువ ఎంత వరకు ఉంచాలో శాస్త్రవేత్తలు వివరించారు. శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సురేష్, విజయ్ కుమార్, శ్వేత, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఎంపీపీ రఘు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అవారి గంగారం తదితరులు ఉన్నారు.

రెండో రోజుకు చేరిన ఏఎన్ఎంల సమ్మె



సమ్మె చేస్తున్న ఏఎన్ఎంలు

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏఎన్ఎంల సమ్మె గురువారం రెండో రోజుకు చేసుకుంది. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తమను రెగ్యూలర్ చేశాకే పరీక్షలు నిర్వహించాలన్నారు. సమ్మెకు మాదిగ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు మేరీ కుమారి మద్దతు తెలిపారు. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.బాలరాజ్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మెలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజుల పాటు సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేకర్ తెలిపారు.

ఘనంగా తీజ్ వేడుకలు



మాచారెడ్డి: సోమవారంపేటలో గిరిపుత్రులు గురువారం తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోధుమ కుదుళ్లతో బతుకమ్మ ఆడి అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత చెరువులో నిమజ్జనం చేశారు.

పలు చోరీలు చేసిన నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న నగర సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్

ఖలీల్‌వాడి : నగరంలోని దుబ్బ, గౌతంనగర్ ప్రభుత్వ పాఠశాలతో పాటు సుభాష్‌నగర్‌లోని రాఘవేంద్రస్వామి ఆలయంలో చోరీ చేసిన బాలనేరస్తుడితో పాటు సామగ్రి కొనుగోలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర సీఐ నరహరి తెలిపారు. నగరంలోని 3వ టౌన్ పీఎస్ ఏర్పాటు చేసిన సమావేశంలో నగర సీఐ మాట్లాడారు. గౌతంనగర్‌కు చెందిన వకోడ శివదౌత్(21), దుబ్బకు చెందిన బాలనేరస్తుడు రాత్రి వేళల్లో ప్రభుత్వ పాఠశాలలోని ఆఫీస్‌రూం తాళాలు పగలగొట్టి అందులోని ఆంప్లిఫైర్‌తో పాటు రెండు సిలెండర్లు, రాఘవేంద్రస్వామి దేవాలయంలో పూజ సామన్లు ఇత్తడి, రాగి చీర చేసశారన్నారు. జల్సాలకు అలవాటు పడి శివదౌత్, బాలనేరస్తుడు, చౌహాన్ అర్జున్‌లు ముగ్గురు చోరీలకు పాల్పడేవారన్నారు. చోరీ సొత్తును కొనుగోలు చేసిన పోతంకర్ దుర్గా రాజు(61)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దత్తు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్సై ప్రవీణ్‌కుమార్, కానిస్టేబుల్ అప్సర్‌ను సీఐ నరహరి అభినందించారు.

తండ్రిని చంపిన కుమారుడికి జైలు

ఖలీల్‌వాడి : తండ్రిని కడతేర్చిన కొడుకుకు ఐదేళ్ల కఠిన జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల గురువారం తీర్పు చెప్పారు. మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఏరుగట్ల గంగారాంకు ఇద్దరు కొడుకులు రవి, రాజు, ఇద్దరు కుమార్తెలు రాణి, లావణ్య ఉన్నారు. గంగారాం వేల్పూర్ మండలంలోని పడగల్ గ్రామం నుంచి మోర్తాడ్‌కు లక్ష్మి అనే మహిళను వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చారు. భార్య నుంచి వచ్చిన ఆస్తిని తమకు ఇవ్వడం లేదనే విషయమై చిన్నకొడుకు తరచూ తండ్రితో గొడవకు దిగేవాడు. జూలై 27, 2018న రాజు ఒక మద్యం సేవిస్తుండగా తండ్రి తిట్టడంతో కోపోద్రిక్తుడైన రాజు తండ్రి కర్రతో కడుపులో కొట్టగా గంగారాం మృతి చెందాడు. రాజు నేరం రుజువైనందున ఐదేళ్ల శిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో మూణ్నెళ్ల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. మోర్తాడ్ పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్ వాదించారు.

లారీని ఢీకొన్న కారు: పలువురికి స్వల్పగాయాలు



లారీని వెనక నుంచి ఢీకొన్న కారు

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలో పాత జాతీయ రహదారి 44 పై లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో కారులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న లారీ వెనుక కారు ప్రయాణిస్తుంది. లారీ డ్రైవర్ ఒక్క సారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న కారు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నిర్మల్‌కు చెందిన ఇద్దరికి స్వల్ప గాయలయ్యాయి. క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్


పాత నేరస్తుడి అరెస్టు



హోంగార్డు, కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం : భిక్కనూరుకు సమీపంలోని ఓ దాబా వద్ద బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా బ్లూకోర్టు కానిస్టేబుల్ గణేశ్, హోంగార్డు రమేష్ గుర్తించారు. అతడిని పట్టుకుని వేలి ముద్రలను తనిఖీ చేశారు. దీంతో అతడు పాత నేరస్తుడని తేలింది. గతంలో చోరీల్లో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని భిక్కనూరు ఠాణాకు తీసుకువచ్చారు. సంగారెడ్డి జిల్లా నర్సాపూర్‌కు చెందిన మోహన్‌గా గుర్తించారు. ఈ ప్రాంతంలో దొంగతనాలు చేసేందుకు వచ్చినట్లు విచారణలో తేలింది. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్, హోంగార్డులను జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు.

క్రషర్ గుంతలో మునిగి యువకుడి మృతి



ప్రమాదకరంగా ఉన్న గుంతలు



భీంరావు(ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : అధికారుల విధి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైన ఘనట నస్రుల్లాబాద్‌లో చోటు చేసుకుంది. మండల కేంద్రంలో ఉన్న బీవీఎస్ఆర్ పేరుతో ఏర్పాటు చేసిన క్రషర్ భూమిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం కంకర క్రషింగ్ నిలిచిపోయినా కంకర కొద్దిగా ఉండడంతో పనులు సాగుతున్నాయి. మండల కేంద్రంలో మహారాష్ట్రలోని నాందేడ్ గ్రామానికి చెందిన భీంరావు(23) గురువారం తోటి మిత్రులతో కలిసి మేకలను మేపేందుకు మైలారం–నస్రుల్లాబాద్ మధ్య గల క్రషర్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ ఉన్న క్రషర్ గుంతలోని నీళ్లలోని మేకలను దింపారు. తిరికి వాటిని తీసుకొచ్చేందుకు ముగ్గురు మిత్రులు దిగగా భీంరావు మాత్రం నీటిలో మునిగి మృతి చెందాడు. స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలోను క్రషర్‌లో పనిచేసే కుటుంబంలోని బాలిక కూడా ఈ భారీ నీటిగుంతలో మునిగి మృతిచెందిందని, ఓ మహిళ కుటుంబ కలహాలతో మనస్తాపంతో ఈ క్రషర్ గుంతలో దూకగా తీవ్ర గాయాలయ్యాయని పలువురు పేర్కొంటున్నారు. క్రషర్ గుంత చుట్టూ కంచె, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అనారోగ్యంతో వార్డు సభ్యురాలి మృతి



బాలవ్వ (ఫైల్)

పిట్లం(జుక్కల్) : మండలంలోని గౌరారం గ్రామ పంచాయతీ 6వ వార్డు సభ్యురాలు దుంపల బాలవ్వ (55) గురువారం మృతి చెందారు. గ్రామ సర్పంచ్ అనసూయ మాట్లాడుతూ వార్డు సభ్యురాలు దుంపల బాలవ్వ కొన్నిరోజుల క్రితం అనారోగ్యానికి గురైందని, గురువారం ఉదయం తీవ్ర జ్వరం రావడంతో ఆరోగ్యం బాగా క్షీణించి మృతి చెందినట్లు తెలిపారు. ఆమె అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించగా పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తికి గాయాలు



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణం రాకాసీపేట్‌లో రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో వచ్చిన మహబూబ్‌నగర్–బోధన్ ప్యాసింజర్ రైలు నుండి కిందికి దిగి వెళ్తుండగా లతీఫ్(48)కు తీవ్ర గాయాలయ్యాయి. లతీఫ్ బుధవారం రాత్రి మహబూబ్‌నగర్– బోధన్ ప్యాసింజర్ రైలులో వచ్చాడు. రైలు దిగి వెళ్తుంగా పట్టుతప్పి పట్టాలపై పడ్డాడు. అదే సమయంలో రైలు ఇంజిన్ అదే పట్టాలపై వెళ్తూ లతీఫ్ చేయి మీదుగా వెళ్లడంతో లతీఫ్ చేయి తెగిపోయింది. స్థానికులు గమనించి 108లో ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రాకాసీపేట్‌కు చెందినట్లుగా పోలీసులు గుర్తించారు.

కేజీవీల్ ట్రాక్టర్ సీజ్

బాల్కొండ : మెండోరామండల కేంద్రానికి చెందిన జీవన్‌రెడ్డి తారు రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్ నడుపుతూ వెళ్లడంతో ట్రాక్టర్‌ను మెండోరా పోలీసులు సీజ్ చేశారు. ఎలాంటి పట్టీలు లేకుండా కోడిచర్ల వైపు తారు రోడ్డుపై కేజీవీల్‌తో వెళ్లడంతో రోడ్డు ధ్వంసమైందన్నారు. కేసు నమోదు చేసుకుని ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించారు.

అత్తింటి వేధింపులకు యువకుడి బలి

ఖలీల్‌వాడి : నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌కు చెందిన ఆసర్ల శ్రీనివాస్(29) అత్తింటి వేధింపులకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై తెలి పిన వివరాలు .. శ్రీనివాస్‌కు బోధన్ కు చెందిన భాగ్యతో వివాహం జరిగింది. అయితే అత్త ఇంటికి ఇల్లరికం రావాలని తరుచూ వేధించడంతో పలుమార్లు పంచాయతీలు జరిగినట్లు తెలిపారు. ఇల్లరికం వెళ్లిన శ్రీనివాస్‌ను అత్తమామ తోపాటు బామ్మర్ది, భార్య గొడవలకు దిగి కొట్టిన ట్లు చెప్పారు. దీంతో మనస్థాపం చెందిన శ్రీనివాస్ సొంతింటికి వచ్చి ఉరివేసుకున్నట్లు చెప్పారు. మృతుడు శ్రీనివాస్ తండ్రి అసర్ల మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మామ చిన్నకోట్ల సాయిలు, అత్త సావిత్రి, బామ్మర్ది మహేష్ తోపాటు మృతుడి భార్య భాగ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల అటాచ్

ఖలీల్‌వాడి : నగరంలోని ఐదవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకుంట రాజు(28) పోలీస్‌స్టేషన్‌లో పెట్రోల్ పోసుకొని మృతి చెందిన కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లను నవీపేట్, మాక్లూర్ పోలీస్‌స్టేషన్లకు అటాచ్ చేశారు. తరుచూ డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు రాజును చితకబాదినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆరోపణలు వచ్చిన ఇద్దరు కానిస్టేబుళ్లపై నివేదికను సీపీకి పంపించినట్లు తెలిసింది. దీంతోపాటు పోలీసులు మృతుడి తల్లిని విచారణ చేయగా భార్య తోపాటు బంధువులు ఇబ్బందులు చేసినట్లు స్పష్టం చేసినట్లు సమాచారం. సీపీ నిర్ణయం మేరకే కానిస్టేబుళ్లపై చర్యలు ఉంటాయనే చర్చ పోలీస్‌వర్గాలలో వినిపిస్తుంది.

పేకాటరాయుళ్ల అరెస్ట్



మోపాల్(నిజామాబాద్ రూరల్) : మండలంలోని ముదక్‌పల్లి అటవీ ప్రాంతంలో పేకాటస్థావరంపై గురువారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఇద్దరు పారిపోగా, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.23,050, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని, ఇద్దరిని కోర్టులో సమర్పిస్తామని ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం దేవునిపల్లి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన బాలయ్య డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. నిందితుడికి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధించారు.

భిక్కనూరులో మరొకరు..

భిక్కనూరు: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరికి రెండురోజుల జైలుశిక్ష పడినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన స్వామి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండురోజుల జైలుశిక్షతో పాటు రూ. 200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కామారెడ్డి క్రైం : కుమారునికి జ్వరం రావడంతో ఓ కుటుంబం ఆస్పత్రికి వెళ్లి తిరిగి వచ్చేసరికి అగంతకులు ఇల్లుగుల్ల చేశారు. ఈ ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గురువారం ఉదయం వెలుగు చూసింది. దోమకొండకు చెందిన కంది రవీచందర్ దేవునిపల్లిలో అద్దెకు ఉంటున్నాడు. అతని కుమారుడు హర్షవర్ధన్‌కు జ్వరంరావడంతో బుధవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అడ్మిట్ చేసుకోవడంతో రాత్రి ఇంటికి వచ్చి 11 గంటల ప్రాంతంలో భోజనం చేసి తిరిగి ఆస్పత్రికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని 13 మాసాల బంగారు అభరణాలు, రూ. 42 వేల నగదును ఎత్తుకెళ్లారు. దేవునిపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుండెల్లి రాజు పేర్కొన్నారు.